**విలేకరులు కావలెను**

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455

hindustanmedia333@gmail.com

APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దిన పత్రిక

సామాన్యుడి నేస్తం




ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 65 శుక్రవారం 3 జూలై 2026 పేజీలు - 4 వెల :2/-

## రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు..

### ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజనం

హిందూస్థాన్ మీడియా

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 లక్షల మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించే పథకాన్ని అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. వీబీజీ రామ్‌జీ పథకంపై రాష్ట్రాలు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అమలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అయితే ఉపాధి హామీ కూలీలకు నష్టం కలగకుండా రాష్ట్రంలో కూడా ఆ పథకాన్ని అమలు చేయాలని భావించినట్లు మంత్రులు తెలిపారు. కొత్తగా ప్రారంభం కానున్న సనత్‌నగర్, ఎల్‌బీనగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్య సేవల బలోపేతం కోసం 6,278 డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేసి, సీఎం సహాయనిధి ద్వారా చికిత్సలకు ఎల్ఓసీలు జారీ చేయాలని నిర్ణయించింది. హైదరాబాద్ మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు



ఫేజ్-1లో గాంధీ సరోవర్ వరకు 21 కిలోమీటర్ల అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందుకోసం రూ.7,345 కోట్లను ఆమోదిస్తూ త్వరలోనే టెండర్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు మంత్రులు వెల్లడించారు. మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాకు వివరించారు.






## ఏజెన్సీ ప్రాంతాలకు అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు కోరిన గిరిజన ఎమ్మెల్యేలు

హిందూస్థాన్ మీడియా

ఏజెన్సీ ప్రాంతంలోని శాసనసభ నియోజకవర్గాలకు అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ఆదివాసీ, గిరిజన ప్రాంత ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క నేతృత్వంలోని ఆదివాసీ, గిరిజన ఎమ్మెల్యేల బృందం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఆదివాసీ ప్రాంతాల్లో పోడు భూములకు పట్టాలు మంజూరు చేయడంతో పాటు 'ఇందిర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేయాలని కోరారు. అలాగే సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థలను (ఐటీడీఏలు) మరింత బలోపేతం చేయడంతో పాటు గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ (అశ్వరావుపేట), పాయం వెంకటేశ్వర్లు (పినపాక), కోరం కనకయ్య (ఇల్లందు), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), వెడ్మ బొజ్జు (ఖానాపూర్) ఉన్నారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహమ్మద్ అజారుద్దీన్ పాల్గొన్నారు.

## ఆర్థిక ఇంధన భద్రత కోసం సమష్టిగా కృషిచేయాలని భారత్ జపాన్ నిర్ణయించాయి

హిందూస్థాన్ మీడియా

ఇందుకోసం ఉమ్మడిగా రోడ్ మ్యాప్ ను రూపొందించాయి. దౌత్య సంబంధాలు ఏర్పడి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా...రక్షణ, ఆర్థిక భద్రత, కృత్రిమ మేధస్సు, ఇంధన రంగాల్లో ఇరుదేశాల మధ్య, పలు ఒప్పందాలు కుదిరాయి. సైనిక పరికరాలను సంయుక్తంగా అభివృద్ధి చేయాలని అవగాహనకు వచ్చాయి.



## సవాల్ చేసి వెనక్కి తగ్గారు.. చర్చకు దమ్ముంటే అసెంబ్లీ పెట్టండి

**చర్చకు సవాల్ చేసిన కాంగ్రెస్ నేతలే వెనక్కి తగ్గారని కేటీఆర్ విమర్శ**
**హరీశ్‌రావు అరెస్టును ఖండిస్తూ వెంటనే విడుదల చేయాలని డిమాండ్**
**అప్పులు, గురుకులాల అంశంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్**
**తన లెక్కలు తప్పని నిరూపిస్తే రాజీనామా చేస్తానన్న మంత్రి జూపల్లి**

(హిందూస్థాన్ మీడియా) :రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చకు తాము సిద్ధమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పునరుద్ఘాటించారు. కానీ సవాల్ చేసిన కాంగ్రెస్ మంత్రులే ఇప్పుడు వెనక్కి తగ్గారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం రేవంత్‌రెడ్డి మొదట చర్చకు సవాల్ విసిరారని తెలిపారు. తాము అంగీకరించాక మాట మార్చారని విమర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పి చివరకు గన్‌పార్క్‌కు వెళ్లడం ఎందుకని ప్రశ్నించారు. సవాళ్లు విసిరే ముందు వాటిని నిలబెట్టుకునే ధైర్యం ఉండాలని అన్నారు. గన్‌పార్క్‌కు వెళు తున్న మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. ప్రభుత్వానికి ఏ అంశంపైనా బహిరంగ చర్చ చేపట్టే ధైర్యం లేదని ఆరోపించారు. హరీశ్‌రావు సహా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ముందే అన్ని వాస్తవాలు చెప్పాలని భావించినా ప్రభుత్వం అడ్డుకుందని విమర్శించారు. రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చించేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. స్పీకర్ ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తి స్థాయిలో చర్చకు అవకాశం కల్పించాలని కోరారు. మరోవైపు గన్‌పార్క్ వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తన సవాల్ కేటీఆర్, హరీశ్‌రావులకు కాదని తెలిపారు. నేరుగా కేసీఆర్‌కేనని స్పష్టం చేశారు. తాను చెప్పిన అప్పుల లెక్కలు తప్పని నిరూపిస్తే మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని ప్రకటించారు.



## స్పీడ్ పోస్టులో గంజాయి దందా

**భారీ నెట్‌వర్క్ బట్టబయలు చేసిన హైదరాబాద్ నార్కోటిక్స్ వింగ్**
**స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠా గుట్టురట్టు**
**ఝార్ఖండ్ కేంద్రంగా దేశంలోని 21 రాష్ట్రాలకు డ్రగ్స్ పంపిణీ**
**'మందులు' అని చెప్పి పార్శిళ్లలో గంజాయి ప్యాక్ చేసి దందా**
**హైదరాబాద్‌లో ఇద్దరు కొనుగోలుదారుల అరెస్ట్, 2 కిలోల గంజాయి స్వాధీనం**
**పోస్టల్ పార్శిళ్లకు స్కానింగ్ తప్పనిసరి చేయాలని కేంద్రానికి లేఖ రాస్తామన్న పోలీసులు**

(హిందూస్థాన్ మీడియా): భారత తపాలా శాఖకు చెందిన స్పీడ్ పోస్ట్ సేవలను అడ్డంపెట్టుకుని దేశవ్యాప్తంగా గంజాయి సరఫరా చేస్తున్న భారీ అంతరాష్ట్ర ముఠా గుట్టును హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) అధికారులు రట్టు చేశారు. ఝార్ఖండ్ కేంద్రంగా సాగుతున్న ఈ నెట్‌వర్క్‌కు చెందిన ప్రధాన సూత్రధారిని అరెస్ట్ చేయడంతో పాటు, హైదరాబాద్‌లో గంజాయి కొనుగోలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, ఝార్ఖండ్‌లోని గిరిడ్ జిల్లాకు చెందిన సత్యం మిశ్రా ఈ ముఠాను




నడుపుతున్నాడు. స్థానికంగా లభించే గంజాయిని సేకరించి, 'ఔషధాలు' అని తప్పుడు డిక్లరేషన్‌తో పార్శిళ్లలో ప్యాక్ చేసి, స్పీడ్ పోస్ట్ ద్వారా దేశంలోని 21 రాష్ట్రాలకు పంపేవాడు. వాట్సాప్, సోషల్ మీడియా వేదికల ద్వారా ఆర్డర్లు తీసుకుంటూ, యూపీఐ ద్వారా నగదు స్వీకరించేవాడు. ఈ అక్రమ వ్యాపారం ద్వారా రోజుకు రూ. 1 లక్ష, నెలకు రూ. 30 నుంచి 35 లక్షల వరకు సంపాదిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా వార్షిక టర్నోవర్ సుమారు రూ. 4 నుంచి 5 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ముఠాలో సత్యం మిశ్రా సోదరుడు శుభం మిశ్రాతో పాటు మరికొందరు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఝార్ఖండ్ నుంచి పంపిన కొన్ని పార్శిళ్లను హైదరాబాద్‌లో అధికారులు అడ్డుకోవడంతో ఈ అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. నగరంలో పార్శిళ్లు అందుకున్న సుశాంత్ వ్యాస్, లడ్డూ అనే ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు, వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై గుడిమల్కాపూర్, ఎస్.ఆర్.నగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ ఘటన పోస్టల్ సర్వీసుల్లోని భద్రతా లోపాలను ఎత్తిచూపుతోందని, పార్శిళ్లకు తప్పనిసరిగా స్కానింగ్ ప్రక్రియను అమలు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తెలిపారు. డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ నేతృత్వంలోని 22 మంది సభ్యుల బృందం ఈ ఆపరేషన్‌ను అత్యంత చాకచక్యంగా పూర్తి చేసింది.

# సత్తా చాటిన సర్కారు బడి

## ట్రిపుల్ ఐటీ' సీట్లు సాధించిన వేచరేణి విద్యార్థినులు సంజన, అంజలి

'చేర్యాల/వేచరేణి (హిందూస్థాన్ మీడియా):
చేర్యాల మండల పరిధిలోని వేచరేణి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ట్రిపుల్ ఐటీ (IIIT) ప్రవేశాల్లో సీట్లు సాధించి తమ పాఠశాలకు, గ్రామానికి విద్యా రంగంలో సరికొత్త కీర్తిని తెచ్చిపెట్టారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రతిభ ఆధారంగా నిర్వహించిన ట్రిపుల్ ఐటీ ప్రవేశాల కౌన్సిలింగ్ ప్రక్రియలో వేచరేణి ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి సీట్లు కైవసం చేసుకున్నారు.

**బూర్గు సంజన:** ప్రతిష్ఠాత్మకమైన రాజీవ్ గాంధీ నాలెడ్జ్ టెక్నాలజీస్ (RGUKT) - IIIT బాసర లో సీటు సాధించింది.

**బస్వరాజు అంజలి:** నూతనంగా ఏర్పాటైన IIIT మహబూబ్‌నగర్ క్యాంపస్‌లో సీటు దక్కించుకుంది.

**కృషి, పట్టుదలకు దక్కిన ఫలితం:**
ఈ సందర్భంగా చేర్యాల వీజుూ బి. నరేందర్ , వేచరేణి పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు KVN రెడ్డి సంయుక్తంగా మాట్లాడుతూ..విద్యార్థినుల నిరంతర కృషి, పట్టుదల, ఉపాధ్యాయ బృందం అందించిన సరైన మార్గ దర్శకత్వం, తల్లి దండ్రుల ప్రోత్సాహం వల్లే ప్రభుత్వ పాఠశాల విద్యార్థు లు నేడు కార్పొరేట్ సంస్థల కు పోటీగా ఇలాంటి ఉన్న తమైన ఫలితాలను సాధిం చగలిగారని కొనియా డారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించడం మిగతా విద్యార్థులకు ఎంతో స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు.




**గ్రామస్తులు హర్షాతిరేకాలు:**
వేచరేణి ఉన్నత పాఠశాల కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటిన సంజన, అంజలిలకు పాఠశాల ప్రధానో పాధ్యాయులు, చేర్యాల ఎంఈఓ బి. నరేందర్ ,స్థానిక గ్రామ సర్పంచ్, ఏఏపీసీ (AAPC) చైర్మన్, పాలకవర్గ కమిటీ సభ్యులు, వార్డు మెంబర్లు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు మరియు వేచరేణి గ్రామ ప్రజల తరపున హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఆ ఇద్దరు విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నత చదువులు అభ్యసించి, జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# పీఆర్సీని తక్షణమే ప్రకటించాలి

## రాష్ట్ర ప్రభుత్వానికి సుంకరి భిక్షం గౌడ్ విజ్ఞప్తి

కట్టంగూర్, జూలై 2:
మండల కేంద్రంలోని కట్టంగూర్ హైస్కూల్‌లో పీఆర్టీయూటీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్ ఉపాధ్యాయులకు సంఘ సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పీఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ కొత్త పీఆర్సీ అమలు కాకపోవడం బాధాకరమని అన్నారు. గత నెల రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారం రోజుల్లో పీఆర్సీ కమిటీ నివేదికను తెప్పించుకుంటామని ప్రకటించినప్పటికీ, ఇప్పటి వరకు నివేదిక కూడా అందుబాటులోకి రాలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీ నివేదికను స్వీకరించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరే విధంగా మంచి పీఆర్సీని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చెల్లిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాట కార్యక్రమం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగిం దన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో సింగిల్ టీచర్ విధానానికి స్వస్తి పలికి, 20 మంది లోపు విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను నియమిం చాలని కోరారు. అలాగే పాఠశాలల్లో మౌలిక వసతు లు కల్పించి, ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ కట్టంగూర్ మండల శాఖ అధ్యక్షుడు నిమ్మనగోటి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, మాజీ అధ్యక్షుడు నీల కనకయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సమ్మెటి తిరుమలేష్, విట్టల్ కుమార్, చిన్ని శ్రీనివాస్, జిల్లా బాధ్యులు రామ్ కోటి, సముద్రాల నారాయణ, శ్రీనివాస్, గిరిధర్ చారి, రవికుమార్, యుగేందర్, వెంకట్ రెడ్డి, శేఖర్, రాజశేఖర్, సత్యనారాయణ, పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

కట్టంగూర్, జూలై 2:
మండల పరిధిలోని ఇస్మాయిల్ పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ నల్లగొండ ఆధ్వర్యంలో గురువారం విద్యా సామాగ్రి, స్నాక్స్ పంపిణీ చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు మొగుళ్లపల్లి భాస్కర్, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కక్కిరేణి బద్రినారాయణల దాతృత్వంతో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, పలకలు, స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి అంబటి అంజయ్య విచ్చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు దాతలు, సేవా సంస్థలు అండగా నిలవడం అభినందనీయమ న్నారు. లయన్స్ క్లబ్ నల్లగొండనిరంతరంఇలాంటి సామా జిక సేవా కార్యక్రమాల్లో ముందు ండడంసంతోషకరమని కొనియా డారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకొని ఉన్నత శిఖ రాలను అధిరోహించాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కోడె సతీష్‌కుమార్,లయన్స్‌క్లబ్‌నల్లగొండ అధ్యక్షులుయరమాదఅశోక్, కార్యదర్శి యల్.వి. యాదవ పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు అరుణ, సహోపాధ్యాయురాలు సుమలత పాల్గొన్నారు.




# ఇంపాక్ట్ సర్టిఫైడ్ మోటివేషనల్

## ట్రైనర్‌గా రావుల శాలిని--రాజు గౌడ్



చేర్యాల, హిందుస్థాన్ మీడియా:
సామాజిక సేవ, మహిళా సాధికారత, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం కోసం కృషి చేస్తున్న రావుల శాలిని--రాజు గౌడ్ తాజాగా ఇంపాక్ట్ సర్టిఫైడ్ మోటివేషనల్ ట్రైనర్గా గుర్తింపు పొందారు. ఇంపాక్ట్ సంస్థ నిర్వహించిన 30 రోజుల ఆన్‌లైన్ శిక్షణ, రెండు రోజుల ఆఫ్‌లైన్ వర్క్‌షాప్‌ను విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం సంస్థ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వరరావు, ప్రముఖ ట్రైనర్, 'బాల్యం అమూల్యం' పుస్తక రచయిత సుధీర్ సంద్ర చేతుల మీదుగా ఆమె సర్టిఫికెట్ అందుకున్నారు. కార్యక్రమంలో కె. రామచంద్రుడు, శ్రీనివాస్ సోని, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాలిని--రాజు గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, జీవన నైపుణ్యాలపై ఉచిత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

# చేర్యాల ఏఓ బోగేశ్వర్ స్వామి సస్పెన్షన్

## రూ.17.10 లక్షల సబ్సిడీ యూరియా అక్రమాలపై కలెక్టర్ సీరియస్




చేర్యాల, హిందుస్థాన్ మీడియా:
సిద్దిపేట జిల్లా చేర్యాల మండల వ్యవసాయ అధికారి (ఏఓ) బోగేశ్వర్ స్వామిని విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం కారణంగా జిల్లా కలెక్టర్ కె . హైమావతి సస్పెండ్ చేశారు. మండలంలో రైతులకు సబ్సిడీపై అందించాల్సిన రూ.17.10 లక్షల విలువైన 6,429 యూరియా బస్తాలు పక్కదారి పట్టడం, నకిలీ బిల్లింగ్ వ్యవహారం వెలుగులోకి రావడంతో జిల్లా యంత్రాంగం విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో పర్యవేక్షణ లోపం, విధుల్లో నిర్లక్ష్యం ఉన్నట్లు తేలడంతో కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. రైతులకు అందాల్సిన సబ్సిడీ ఎరువుల పంపిణీలో ఎలాంటి అక్రమాలు సహించబోమని, విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది.

# కపస్ కాంతి పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

– కలెక్టర్ బడుగు చంద్రశేఖర్





కట్టంగూర్, జూలై 2 :
కపస్ కాంతి పథకంలో భాగంగా పంపిణీ చేస్తున్న పత్తి విత్తనాలను జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. మండల కేంద్రమైన కట్టంగూరు రైతు వేదికలో గురువారం ఏర్పాటుచేసిన పత్తి విత్తనాల ప్రదర్శన పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కపస్ కాంతి పథకంలో భాగంగా 19 ప్రముఖ కంపెనీలకు చెందిన లక్ష 65 వేల పత్తి విత్తనాల ప్యాకెట్లు జిల్లాలో సిద్ధంగా ఉన్నాయని, అలాగే వీటితోపాటు సస్యరక్షణ మందులైన వేప నూనె, సూక్ష్మ పోషకాలు ,జీవ నియంత్రణ ఎరువులు కూడా రైతులకు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు .రెండున్నర ఎకరాలు కలిగిన రైతుకు 5 పత్తి విత్తనాల పాకెట్లను ఉచితంగా అందజేయడం జరుగుతుందని వీటిని సద్వినియోగం చేసుకొని రైతులు అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ప్రస్తుతం ఎల్ నినో కారణంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పప్పు దినుసులు, చిరుధాన్యాలు పండించాలని, వరిలో సన్న రకాల వైపు రైతులు వెళ్లాల్సిన అవసరం ఉందని, వ్యవసాయ అధికారులు కూడా రైతులను సన్నాల వైపు ప్రోత్సహించాలని కోరారు. యూరియా స్థానంలో నానో యూరియా వాడాలని ,నానో యూరియా ఉపయోగాలను రైతులకు తెలియజేసి వాటిని వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కాగా కపస్ కాంతి పథకంలో భాగంగా జిల్లాలో 19 ప్రముఖ కంపెనీలకు చెందిన లక్ష 65 వేల పత్తి విత్తనాల పాకెట్ల ద్వారా అధిక దిగుబడులు సాధించే ఉద్దేశ్యంతో , ఇదివరకు పత్తి సాగులో ఉన్న లోపాలను సవరిస్తూ ఎకరాకు కనీసం 750 కిలోల దిగుబడిని సాధించే విధంగా ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నది. ఈ కార్యక్రమంలో భాగంగా రెండున్నర ఎకరాలకు 5 పాకెట్లు అధిక సాంద్రత కలిగి దగ్గరగా పత్తి విత్తనాలు వేసే రైతులకు 10 పాకెట్లు, ఆ పై 15 ప్యాకెట్లను ఇచ్చే విధంగా రూపొందించడం జరిగింది. ఇందుకు సంబంధించి రైతులు పత్తి విత్తనాలు, యాజమాన్య పద్ధతులు వాటిలోని మెలకువలను పాటించి లబ్ధి పొందాలని కలెక్టర్ కోరారు. ముఖ్యంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ఇచ్చే సూచనలు తెలుసుకోవాలని,ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పత్తి విత్తనాల పంపిణీ వివరాలను అన్ని రైతు వేదికల వద్ద వ్యవసాయ కార్యాలయాల వద్ద రైతులకు అర్థమయ్యే విధంగా ఫ్లెక్సీ ద్వారా ప్రదర్శించాలని, ఉదయం నుండి సాయంత్రం వరకు విత్తనాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే వ్యవసాయ అధికారులతో రైతులు చర్చించాలని కలెక్టర్ సూచించారు. నకిరేకల్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి విజయేందర్ రెడ్డి, కట్టంగూరు తహసిల్దార్ పుష్పలత తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మండల కేంద్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని పరిశీలించారు. సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి చేయాలని బి ఎల్ ఓ లను ఆదేశించారు.


# క్రీడలు

## హార్దిక్ పాండ్యా ట్రేడింగ్‌పై సీఎస్‌కే క్లారిటీ.. సీఈఓ ఏమన్నారంటే..!

-ముంబై ఇండియన్స్‌ను వీడనున్నట్లు హార్దిక్ పాండ్యాపై ఊహాగానాలు
-హార్దిక్‌ను దక్కించుకునే రేసులో చెన్నై, కోల్‌కతా ఉన్నాయంటూ ప్రచారం
-ట్రేడింగ్ వార్తలను ఖండించిన సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్
-ఎంఎల్‌సీ తర్వాతే జట్టుపై సమీక్ష ఉంటుందని స్పష్టీకరణ
-కెప్టెన్సీ మార్పు కోసమే హార్దిక్‌పై సీఎస్‌కే ఆసక్తి చూపుతోందన్న విశ్లేషణలు



ఐపీఎల్ ప్లేయర్ల ట్రేడింగ్ విండోకు సంబంధించి ఊహాగానాలు జోరందుకున్నాయి. ముఖ్యంగా ముంబై ఇండియన్స్ (ఎంఐ) స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా పేరు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఐపీఎల్ 2026లో ముంబై పేలవ ప్రదర్శన నేపథ్యంలో హార్దిక్‌ను ఆ జట్టు ట్రేడ్ చేయవచ్చని, అతడిని దక్కించుకోవడానికి ఏకంగా ఏడు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతున్నాయని కథనాలు వెలువడ్డాయి. ఈ రేసులో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ముందున్నాయని ప్రచారం జరిగింది. ఈ వార్తలపై తాజాగా చెన్నై సూపర్ కింగ్స్ సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పందించి స్పష్టతనిచ్చారు. హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ గురించి తమ ఫ్రాంచైజీలో ఇప్పటివరకు ఎలాంటి చర్చలు జరగలేదని కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. 'హిందుస్థాన్ టైమ్స్'తో ఆయన మాట్లాడుతూ.. "మేము దీనిపై ఇంకా ఎలాంటి చర్చలు జరపలేదు. మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) ముగిసిన తర్వాతే జట్టుపై పూర్తిస్థాయి



సమీక్ష ఉంటుంది. ఆ తర్వాతే ఇలాంటి విషయాలపై ఒక నిర్ణయానికి వస్తాం" అని వివరించారు. అమెరికాలో జరిగే టీ20 లీగ్ అయిన ఎంఎల్‌సీ జులై 18న ముగియనుంది. ఇందులో సీఎస్‌కే అనుబంధ జట్టు టెక్సాస్ సూపర్ కింగ్స్ కూడా ఆడుతోంది. మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా మూడు సీజన్లలో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. ఐపీఎల్ 2025లో 10వ స్థానంలో నిలవగా, 2026 సీజన్‌లో 8వ స్థానంతో సరిపెట్టుకుంది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఫామ్‌తో పాటు అతని కెప్టెన్సీపై కూడా విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జట్టుకు కొత్త నాయకత్వం అవసరమని, అందుకు హార్దిక్ పాండ్యా సరైన ఎంపిక అని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. గతంలో రాజస్థాన్ రాయల్స్ నుంచి సంజూ శాంసన్‌ను సీఎస్‌కే ట్రేడ్ చేసుకున్నందున, ఇప్పుడు కూడా అలాంటి సంచలన నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు. ఒక ప్రముఖ మీడియా కథనం ప్రకారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) మినహా మిగిలిన అన్ని ఫ్రాంచైజీలు హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026లో హార్దిక్ వ్యక్తిగతంగా విఫలమైనప్పటికీ, భారత జట్టులో కీలక ఆల్ రౌండర్‌గా, వైట్ బాల్ క్రికెట్‌లో ప్రపంచంలోని అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా అతనికి మంచి డిమాండ్ ఉంది. అందుకే అతని ట్రేడింగ్ విషయం ఇంతగా చర్చనీయాంశంగా మారింది.

## వైభవ్ అరంగేట్రం ఆలస్యం.. గవాస్కర్ కీలక వ్యాఖ్యలు

-ఇంగ్లాండ్‌తో తొలి టీ20లోనూ వైభవ్‌కు దక్కని అవకాశం
-15 ఏళ్ల వయసులో ఒత్తిడిని పెద్దగా పట్టించుకోరని అభిప్రాయపడ్డ గవాస్కర్
-సీనియర్ ఆటగాళ్ల నుంచి నేర్చుకోవడం వైభవ్‌కు లాభమని సూచన
-వర్షం కారణంగా తొలి టీ20 రద్దు



యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి టీమిండియా తరఫున ఆడే అవకాశం కల్పించడంలో మరింత ఆలస్యం చేస్తే అతడిపై ఒత్తిడి పెరుగుతుందని భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. ఇంగ్లాండ్‌తో తొలి టీ20లోనూ వైభవ్‌కు తుది జట్టులో చోటు దక్కకపోవడంపై ఆయన స్పందించారు. అవకాశం ఎంత ఆలస్యమైతే అతడిపై అంతగా అంచనాలు పెరుగుతాయని పేర్కొన్నారు. "వైభవ్‌కు అవకాశం వచ్చినప్పుడు వెంటనే తనను తాను నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. అందుకే ఆలస్యం అతడిపై మరింత ఒత్తిడిని పెంచుతుంది. అయితే 15 ఏళ్ల వయసులో ఆటగాళ్లు ఒత్తిడి గురించి ఎక్కువగా ఆలోచించరు" అని గవాస్కర్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ భారత జట్టులోని సీనియర్ ఆటగాళ్లతో కలిసి ఉండడం, వారి నుంచి నేర్చుకోవడం వైభవ్‌కు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఐర్లాండ్ సిరీస్‌లోనూ బెంచ్‌కే పరిమితమైన వైభవ్‌కు, ఇంగ్లాండ్‌తో తొలి టీ20లో కూడా అవకాశం లభించలేదు. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌లతో కూడిన ఓపెనింగ్ కాంబినేషన్‌పైనే జట్టు యాజమాన్యం మరోసారి నమ్మకం ఉంచింది. కాగా వర్షం కారణంగా ఇంగ్లాండ్‌తో తొలి టీ20 మ్యాచ్ ఫలితం తేలకుండా రద్దయింది.

# బిజినెస్

## రిజర్వ్ బ్యాంక్ సంచలన నివేదిక: దేశ ఆర్థిక వ్యవస్థకు ద్రవ్యోల్బణం కంటే పెను ముప్పుగా మారిన 'ఏఐ'!

-ఆర్‌బీఐ జూన్ 2026 'ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్' విడుదల
-రాబోయే 12 నెలల్లో ఏఐ ఆధారిత సైబర్ దాడులే పెద్ద సవాలు
-పరిమిత క్లౌడ్ సంస్థలపై బ్యాంకులు ఆధారపడటంపై ఆందోళన
-సైబర్ భద్రతను పెంచేందుకు ఆర్‌బీఐ నూతన వ్యూహం



దేశ ఆర్థిక వ్యవస్థకు సంప్రదాయ ముప్పులైన ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల కంటే.. వేగంగా విస్తరిస్తున్న 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (కృత్రిమ మేధస్సు) సాంకేతికతే అత్యంత ప్రమాదకరంగా మారిందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) హెచ్చరికలు జారీ చేసింది. ఆర్‌బీఐ తాజాగా విడుదల చేసిన జూన్ 2026 నాటి 'ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్' (ఆర్థిక స్థిరత్వ నివేదిక)లో ఈ కీలక అంశాలను వెల్లడించింది. ఆర్థిక రంగంలో ఏఐ ప్రవేశం వల్ల పనితీరు మెరుగైనప్పటికీ, అదే స్థాయిలో వ్యవస్థ భద్రతకు ఇది ఒక పెద్ద సవాలుగా పరిణమించిందని ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది.

### ఏఐ ఆధారిత సైబర్ దాడుల ముప్పు

దేశంలోని ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థల అభిప్రాయాల ప్రకారం.. రాబోయే 12 నెలల్లో సంభవించే సైబర్ ముప్పులలో 'ఏఐ ఆధారిత సైబర్ దాడులే' అత్యంత ప్రమాదకరమైనవిగా మొదటి స్థానంలో నిలిచాయి. సాధారణ హ్యాకింగ్, రాన్సమ్‌వేర్, ఫిషింగ్ దాడుల కంటే.. ఏఐ సాయంతో సైబర్ నేరగాళ్లు చేసే దాడులు అత్యంత వేగంగా, సమర్థంగా, ఊహించని స్థాయిలో వ్యవస్థలను అతలాకుతలం చేసేలా ఉంటాయని నివేదిక స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా కలకలం సృష్టించిన 'మైథోస్ రాన్సమ్‌వేర్' దాడిని ఇందుకు ఉదాహరణగా పేర్కొంది.

### బ్యాంకులకు ఇతర సవాళ్లు

సైబర్ దాడులతో పాటు ఆర్‌బీఐ ఈ నివేదికలో మరికొన్ని ముఖ్యమైన లోపాలను ఎత్తిచూపింది.

**పరిమిత సంస్థలపై ఆధారపడటం:** మెజారిటీ బ్యాంకులు కేవలం కొన్ని క్లౌడ్ ప్లాట్‌ఫారమ్‌లు లేదా ఏఐ టెక్నాలజీ ప్రొవైడర్లపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఒకవేళ ఆ నిర్దిష్ట ప్లాట్‌ఫామ్ సాంకేతిక లోపానికి గురైతే, దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం కుప్పకూలే ప్రమాదం (కన్సంట్రేషన్ రిస్క్) ఉంది.

**అరకొర సంసిద్ధత:** మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా డేటా గవర్నెన్స్ లోపాలు ఉండటం, అలాగే మెజారిటీ ఆర్థిక సంస్థలు ఏఐ ముప్పులను ఎదుర్కొనే విషయంలో ఇంకా ప్రాథమిక లేదా మధ్యస్థ స్థాయిలోనే ఉండటం గమనార్హం.

ఈ పరిణామాల నేపథ్యంలో, బ్యాంకులు సైబర్ భద్రత కోసం తమ బడ్జెట్‌ను, ఐటీ సిబ్బందిని భారీగా పెంచుకుంటున్నాయి. మరోవైపు, అంతర్జాతీయ నియంత్రణ సంస్థల (FSB, IOSCO, OECD) తరహాలోనే ఆర్‌బీఐ కూడా త్వరలోనే అత్యంత కఠినమైన ఏఐ గవర్నెన్స్ నియమాలను, సరికొత్త 'ఫైనాన్షియల్ సెక్టార్ సైబర్ సెక్యూరిటీ స్ట్రాటజీ'ని అమల్లోకి తీసుకురావడానికి కసరత్తు చేస్తోంది.

## వాట్సాప్ యూజర్‌నేమ్ ఫీచర్‌పై కీలక ప్రకటన.. ఆందోళనలపై పూర్తి క్లారిటీ



-రాబోయే యూజర్‌నేమ్ ఫీచర్‌పై నెలకొన్న ఆందోళనలపై వాట్సాప్ వివరణ
-ఈ ఫీచర్ తప్పనిసరి కాదని, పూర్తిగా ఐచ్ఛికమని స్పష్టీకరణ
-మోసాలు, ఫేక్ అకౌంట్లను నిరోధించేందుకు పటిష్ఠమైన భద్రతా చర్యలు
-భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక్కడ ఫీచర్ ప్రారంభం వాయిదా
-ప్రముఖుల పేర్లను ఇతరులు క్లెయిమ్ చేసుకోకుండా ప్రత్యేక ఏర్పాట్లు

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్, త్వరలో తీసుకురానున్న 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై నెలకొన్న ఆందోళనలపై స్పష్టతనిచ్చింది. ఈ ఫీచర్ పూర్తిగా ఐచ్ఛికమని, వినియోగదారుల భద్రతకు పెద్దపీట వేస్తూ అనేక జాగ్రత్తలు తీసుకున్నామని మెటా యాజమాన్యంలోని వాట్సాప్ వెల్లడించింది. ఈ ఫీచర్ ద్వారా మోసాలు, నకిలీ ఖాతాల బెడద పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమవడం, భారత ప్రభుత్వం కూడా దీనిపై వివరణ కోరడంతో వాట్సాప్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యే వరకు భారత్‌లో ఈ ఫీచర్ ప్రారంభాన్ని వాయిదా వేస్తున్నట్టు తెలిపింది.

### భద్రతకు పెద్దపీట వేస్తున్నామన్న వాట్సాప్

యూజర్‌నేమ్ ఫీచర్‌పై సోషల్ మీడియాలో వస్తున్న ఆందోళనలు, అనుమానాలను నివృత్తి చేసేందుకు వాట్సాప్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పలు కీలక విషయాలను వెల్లడించింది. వినియోగదారులందరూ తప్పనిసరిగా యూజర్‌నేమ్ క్రియేట్ చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇది కేవలం అదనపు సౌకర్యం మాత్రమేనని, ఫోన్ నంబర్ ద్వారానే వాట్సాప్ వాడకాన్ని కొనసాగించవచ్చని తెలిపింది. ముఖ్యంగా ప్రముఖులు, సెలబ్రిటీలు, ప్రభుత్వ సంస్థలు, అలాగే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఇప్పటికే వెరిఫైడ్ ఖాతాలు ఉన్నవారి యూజర్‌నేమ్‌లను రిజర్వ్ చేసినట్లు వాట్సాప్ పేర్కొంది. అంటే.. ఆ పేర్లను కేవలం వారి అసలైన యజమానులు మాత్రమే క్లెయిమ్ చేసుకోగలరు. తద్వారా ఇతరులు వారి పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి మోసాలకు పాల్పడే అవకాశం ఉండదని భరోసా ఇచ్చింది. పాపులర్ పేర్లను ఎవరైనా రిజర్వ్ చేసుకోవచ్చని వస్తున్న వార్తల్లో నిజం లేదని కొట్టిపారేసింది.

### అపరిచితుల నుంచి రక్షణకు ప్రత్యేక ఫీచర్లు

ఈ ఏడాది చివర్లో యూజర్‌నేమ్ ఫీచర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత, అపరిచిత యూజర్‌నేమ్ నుంచి మెసేజ్ వస్తే వినియోగదారులకు కొన్ని అదనపు వివరాలు కనిపిస్తాయని వాట్సాప్ వివరించింది. సందేశం పంపిన వ్యక్తి ఏ దేశానికి చెందినవారు, వారి వాట్సాప్ ఖాతా కొత్తదా పాతదా, ఇద్దరికీ ఉమ్మడిగా ఏవైనా గ్రూపులు ఉన్నాయా వంటి సమాచారం కనిపిస్తుంది. ఈ వివరాల ఆధారంగా ఆ సందేశానికి స్పందించాలా వద్దా అని యూజర్ నిర్ణయించుకోవచ్చు. ఫోన్ నంబర్ల మాదిరిగా యూజర్‌నేమ్‌లను సెర్చ్ చేసి కాంటాక్ట్ చేసే అవకాశం ఉండదని, ఇది వినియోగదారుల ప్రైవసీకి మరింత రక్షణ కల్పిస్తుందని పేర్కొంది. అదనపు భద్రత కోసం 'యూజర్‌నేమ్ కీ' అనే మరో ఫీచర్‌ను కూడా పరిచయం చేయనున్నట్లు, దీనిని ఎనేబుల్ చేసుకుంటే యూజర్‌నేమ్‌తో పాటు ఈ ప్రత్యేక కీ కూడా ఎంటర్ చేస్తేనే ఇతరులు సంప్రదించగలరని వివరించింది.

### భారత ప్రభుత్వ ఆదేశాలు

అంతకుముందు ఈ కొత్త యూజర్‌నేమ్ ఫీచర్‌పై భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని వాట్సాప్‌ను ఆదేశించింది. ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి, ఆమోదం పొందే వరకు ఈ ఫీచర్‌ను భారత్‌లో ప్రారంభించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలోనే వాట్సాప్ ఈ వివరణ ఇస్తూ, ప్రస్తుతానికి భారత్‌లో ఈ ఫీచర్ విడుదల ప్రణాళికను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

# 'ఇసకపట్నం' (అమెజాన్ ప్రైమ్) సిరీస్ రివ్యూ!





సముద్రఖని – ఐశ్వర్య రాజేశ్ ప్రధానమైన పాత్రలను పోషించిన తెలుగు సిరీస్ 'ఇసకపట్నం'. గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్, 7 ఎపిసోడ్స్ గా రూపొందింది. ప్రవీణ్ లక్కరాజు సంగీతాన్ని సమకూర్చిన ఈ సిరీస్, ఈ రోజు (జులై 2)వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. సునీల్ .. నరేశ్ అగస్త్య .. రాజీవ్ కనకాల .. బెనర్జీ కీలకమైన పాత్రలను పోషించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ విశేషాలు ఏమిటనేది ఇప్పుడు చూద్దాం. నాయుడు (సముద్రఖని) తన భార్యాబిడ్డలతో కలిసి, ఒక సాధారణ వ్యక్తిలా 'ఇసకపట్నం'లో అడుగుపెడతాడు. సముద్రంపై ఆధారపడి మత్స్యకారులు జీవించే ప్రాంతం అది. అక్కడి మత్స్యకారులంతా చిన్నారావు (రాజీవ్ కనకాల) చెప్పినట్టుగా నడుచుకుంటూ ఉంటారు. అది 'పోతన' (జ్వాలా కోటి)కి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. అది గ్రహించిన నాయుడు, అతని సపోర్టుతో చిన్నరావును హత్య చేసి తాను నాయకుడు అవుతాడు. నాయుడు ఆ పోర్టు ఏరియాలో తిరుగులేని నాయకుడిగా ఎదుగుతాడు. అతని కూతురు భారతి (ఐశ్వర్య రాజేశ్) వయసుకి వస్తుంది. తండ్రి దుర్మార్గాలను ప్రత్యక్షంగా చూస్తూ పెరిగిన ఆమె, సమాజానికి మేలు చేసే పనులను చేస్తూ వెళుతుంటుంది. తమ కారు డ్రైవర్ గా పనిచేస్తున్న సూరి (సుధాకర్ కోమకుల)తో ప్రేమలో ఉంటుంది. నాయుడు ఆధిపత్యం అంతకంతకూ పెరుగుతూ వెళ్లడాన్ని పోతన తట్టుకోలేకపోతాడు. నాయుడికి శత్రువైన జమిందార్ ప్రతాప్ వర్మ ( రవి వర్మ) సపోర్టు తీసుకుంటాడు. అదే ఊళ్లో ఆటో నడుపుకుని జీవిస్తున్న పెద్దన్న (నరేశ్ అగస్త్య)కి కార్పొరేటర్ కావాలని ఉంటుంది. రాజకీయాలకు .. ముఠా తగాదాలకు దూరంగా అతను తన జీవితాన్ని కొనసాగిస్తుంటాడు. ఇక నాయుడు కూడానే ఉండే శేఖరం (రాజా) అతని కుర్చీలో కూర్చునే అవకాశం కోసం వెయిట్ చేస్తుంటాడు. ఈ నేపథ్యంలోనే పోతన – ప్రతాప్ వర్మ చేతులు కలిపినట్టుగా నాయుడికి తెలుస్తుంది. ప్రతాప్ వర్మకి గల ఆర్థికబలం గురించి తెలిసిన నాయుడు, అతనికి తన కూతురు భారతినిచ్చి పెళ్లి చేయాలనుకుంటాడు. అప్పుడు భారతి ఎలా స్పందిస్తుంది? ఆమె ప్రేమకథ ఎలాంటి మలుపు తిరుగుతుంది? ప్రతాప్ వర్మను తనవైపుకు తిప్పుకోవడానికి నాయుడు వేసిన ప్లాన్ ఫలిస్తుందా? అతని వారసుడిగా పెత్తనం చెలాయించాలని ఆశపడుతున్న శేఖరం పరిస్థితి ఏమిటి? పోతనకి దక్కే ఫలితం ఎలాంటిది? పెద్దన్న కార్పొరేటర్ అవుతాడా? చివరికి గెలుపెవరిది? అనేది మిగతా కథ. కుటుంబం పట్ల ప్రేమ .. ఇతరుల పట్ల జాలి .. సమాజం పట్ల బాధ్యత లేని వారు ఎంతకైనా తెగిస్తారు. డబ్బు .. అధికారం గురించి మాత్రమే ఆలోచించే అలాంటివారిలో రాక్షసత్వం మాత్రమే కనిపిస్తూ ఉంటుంది. అలాంటి ఒక మనిషిలాంటి మృగం చుట్టూ తిరిగే కథ ఇది. అతని ప్రయాణం .. ఆ దారిలో అతనికి సహకరించే పాత్రలను కలుపుకుంటూ ఈ కథ ముందుకు వెళుతుంది. తన ముఠా రాజకీయాలకు కూతురు జీవితాన్ని బలి చేయడానికి కూడా వెనుకాడని ఒక కఠినాత్ముడి కథ ఇది. ఈ సిరీస్ ను చూస్తున్నప్పుడు మనకి అర్థమయ్యేది ఏమిటంటే, ఇది ప్రధానంగా తండ్రీకూతుళ్ల మధ్య జరిగే పోరాటం అనిపిస్తుంది. అందువలన సముద్రఖనితో సమానమైన పవర్ తో ఐశ్వర్య రాజేశ్ పాత్ర ఉంటుందని ఆడియన్స్ భావిస్తారు .. కానీ అలా జరగలేదు. ఐశ్వర్య రాజేశ్ పాత్రను గాడిలో పెట్టడానికి దర్శకుడు చాలా సమయం తీసుకున్నాడు. ఈ లోగా ఆమెపై ఆవిష్కరించిన సన్నివేశాలలోను అంతగా దమ్ము కనిపించదు. ఫస్టు ఎపిసోడ్ లోనే చాలా కథ చెప్పారు. అదంతా కూడా చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. అయితే ఆ స్థాయి స్పీడ్ లో మిగతా ఎపిసోడ్స్ పరిగెత్తలేకపోయాయి. కథ ఒక దశకి చేరుకున్న తరువాత అక్కడక్కడే తిరుగుతూ ఉంటుంది. పెద్దగా ట్విస్టులు లేకపోవడం .. నెక్స్ట్ ఏం జరుగుతుందో అనే ఒక ఉత్కంఠ రేకెత్తించక పోవడం అసంతృప్తిని కలిగిస్తుంది. చూస్తున్నంత సేపు బాగానే అనిపిస్తుంది .. కానీ ఎక్కడా కొత్త మలుపు అనేది మాత్రం కనిపించదు. కథా పరంగా చూసుకుంటే ముఖ్యమైనవిగా చాలా పాత్రలు కనిపిస్తాయి. కానీ ఆ పాత్రలకు తగిన పవర్ ను జోడించలేకపోయారు. ఆయా పాత్రల మధ్య ఎత్తులు పయ్యెత్తులను ఆసక్తికరంగా ఆవిష్కరించలేకపోయారు. చుట్టూ ఎన్ని పాత్రలు ఉన్నప్పటికీ సముద్రఖని పాత్ర మాత్రమే హైలైట్ అవుతూ ఉంటుంది .. ఆయన పాత్ర మాత్రమే కనిపిస్తూ ఉంటుంది. ఆయన స్థాయికి తగిన పాత్రలు చుట్టూ లేకపోవడం వలన, ఆడియన్స్ లో ఎలాంటి అటెన్షన్ లేకుండా పోతుంది. ఆమె ఉద్దేశం ఏమిటనేది చెప్పే విషయంలో కూడా క్లారిటీ లోపించిందేమో అనే భావన కలుగుతుంది. నిర్మాణ పరమైన నాణ్యత విషయంలో ఎక్కడా వంక బెట్టవలసిన పనిలేదు. ఒక సినిమాను చూస్తున్నట్టుగానే అనిపిస్తుంది. పాత్రలు .. ఆ పాత్రలకు తగిన నటీనటుల ఎంపిక కరెక్టుగా ఉంది. వంశీ పచ్చి పులుసు ఫొటోగ్రఫీ .. ప్రవీణ్ లక్కరాజు సంగీతం బాగున్నాయి. బలమైన కథను రాసుకున్నారు .. సన్నివేశాలను అంతే బలంగా ఆవిష్కరించారు. అయితే ఆయా పాత్రలను డిజైన్ చేసిన తీరులోనే కొంత లోపం కనిపిస్తూ ఉంటుంది. సముద్రఖని నటనను ఇష్టపడేవారికి ఈ సిరీస్ ఇంట్రెస్టింగ్ గానే అనిపిస్తుంది.

## రాజకీయాల్లోకి స్టార్ హీరో సూర్య.. నిజమెంత?



తమిళనాడు రాజకీయాల్లో సినీ గ్లామర్ మరోసారి చర్చనీయాంశమైంది. నటుడు విజయ్ దళపతి పొలిటికల్ ఎంట్రీతో విజయవంతం కావడంతో ఇతర స్టార్ హీరోల రాజకీయ ప్రవేశంపై తరచూ ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో స్టార్ హీరో సూర్య త్వరలోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారంటూ వచ్చిన వార్తలు కోలీవుడ్ వర్గాల్లో కలకలం రేపాయి. సోషల్ మీడియాలో ఈ ప్రచారం జోరుగా సాగడంతో దీనిపై సూర్య టీమ్ అధికారికంగా స్పందించి పూర్తి స్పష్టత ఇచ్చింది. అభిమాన సంఘం నేత వ్యాఖ్యలతోనే.. సూర్య ఎన్నో ఏళ్లుగా 'అగరం ఫౌండేషన్' ద్వారా విద్యార్థులకు, పేదలకు అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన అభిమాన సంఘాలు కూడా ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాయి. ఇటీవల చెన్నైలో జరిగిన 'సూర్య అఖిల భారత అభిమానుల పరిరక్షణ సంఘం' సమావేశంలో సంఘ ప్రతినిధి ఆర్. వీరమణి మాట్లాడుతూ భవిష్యత్తులో సూర్య రాజకీయాల్లోకి రావడం ఖాయమనే అర్థం వచ్చేలా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను ఆధారం చేసుకుని కొన్ని తమిళ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించడంతో సూర్య రాజకీయ అరంగేట్రం వార్త వేగంగా వైరల్ అయింది. విజయ్ తరహాలోనే సూర్య కూడా ప్రజాసేవ నుంచి రాజకీయాల్లోకి వస్తున్నారని అభిమానులు అంచనా వేశారు. పుకార్లకు తెరదించిన సూర్య టీమ్ ఈ ప్రచారం ఊపందుకోవడంతో సూర్య టీమ్ వెంటనే రంగంలోకి దిగింది. సూర్యకు రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన ప్రస్తుతానికి ఎంతమాత్రం లేదని స్పష్టం చేసింది. అభిమాన సంఘం సమావేశంలో వీరమణి చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, వాటితో సూర్యకు ఎలాంటి సంబంధం లేదని తెలిపింది.

## 'లాకప్ 2'లో రామ్ కపూర్‌కు కంగనా స్ట్రాంగ్ వార్నింగ్!



లాకప్ 2– షోలో ప్రత్యేకంగా కనిపించిన కంగనా రనౌత్ మెరుగుపడాలనుకుంటే నిన్ను నువ్వు సమర్థించుకోవద్దని రామ్ కపూర్‌కు హితవు హోస్ట్ ఫరా ఖాన్‌తోనూ రామ్ కపూర్ వాగ్వాదం ప్రముఖ రియాలిటీ షో 'లాకప్: సచ్ యా సజా' సీజన్ 2లో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ సందడి చేశారు. 'జనతా కీ ఆవాజ్' ప్రతినిధిగా ఈ షోకు వచ్చిన ఆమె, కంటెస్టెంట్‌గా ఉన్న సీనియర్ నటుడు రామ్ కపూర్ వైఖరిని తప్పుపట్టారు. వ్యక్తిత్వంలో మెరుగుదల కోరుకునే వారు తమను తాము సమర్థించుకోవడం మానుకోవాలని ఆమె హితవు పలికారు. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారమవుతున్న ఈ షోకు ఫరా ఖాన్, రితేశ్ దేశ్‌ముఖ్ హోస్ట్‌లుగా వ్యవహరిస్తున్నారు. షో ఐదో ఎపిసోడ్‌లో కంటెస్టెంట్ల ప్రవర్తనను సమీక్షించేందుకు కంగనా రనౌత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె నేరుగా రామ్ కపూర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ.. "మీరు ఈ ఆటను అస్సలు సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఈ జైలు వాతావరణం మీకు సరిపడదని భావిస్తే, అసలు ఇక్కడికి ఎందుకు వచ్చారు?" అని నిలదీశారు. దీనికి రామ్ కపూర్ తనను తాను సమర్థించుకునే ప్రయత్నం చేయగా.. "మీలో మార్పు రావాలని మీరు నిజంగా కోరుకుంటే, ముందుగా మిమ్మల్ని మీరు సమర్థించుకోవడం ఆపండి" అని కంగనా స్పష్టం చేశారు. ఇదే ఎపిసోడ్‌లో అంతకుముందు హోస్ట్ ఫరా ఖాన్ కూడా రామ్ కపూర్‌కు చురకలంటించారు. సాధారణంగా వివిధ ప్రాజెక్టులలో కథానాయకుడిగా కనిపించే రామ్, ఈ షోలో మాత్రం వెనుకబడిపోతున్నారని ఆమె వ్యాఖ్యానించారు. దీనిపై రామ్ కపూర్ తీవ్రంగా స్పందిస్తూ.. "అయితే నన్ను పంపించేయండి.. నేను మారను, నా ప్రవర్తన ఇలాగే ఉంటుంది" అని పేర్కొన్నారు. దీనిపై ఫరా ఖాన్ వ్యంగ్యంగా స్పందిస్తూ.. "పరిస్థితులకు అనుగుణంగా మారని వారు డైనోసార్లలా కనుమరుగైపోతారు" అని వ్యాఖ్యానించారు. మొదటి సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరించిన కంగనా, ఈసారి అతిథిగా వచ్చి కంటెస్టెంట్ల ప్రవర్తనపై స్పందించడం ఆసక్తికరంగా మారింది. ఈ ఎపిసోడ్ ప్రసారమైన తర్వాత సోషల్ మీడియాలో దీనిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది.

## 'నాగబంధం' గ్రాండ్ రిలీజ్.. భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు!




విరాట్ కర్ణ హీరోగా నటించిన 'నాగబంధం' రేపే విడుదల ఇప్పటికే 11 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించిన ట్రైలర్ అభిషేక్ నామా దర్శకత్వంలో పాన్ ఇండియా చిత్రంగా నిర్మాణం నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతి బాబు కీలకపాత్రల్లోవిరాట్ కర్ణ హీరోగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'నాగబంధం' ప్రేక్షకుల ముందుకు రానుంది. అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో కథ, స్క్రీన్‌ప్లే అందించి రూపొందించిన ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ఏకంగా 11 మిలియన్లకు పైగా వ్యూస్‌తో సోషల్ మీడియాలో రికార్డులు సృష్టిస్తూ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఈ చిత్రంలో విరాట్ కర్ణ సరసన నభా నటేష్, ఐశ్వర్య మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు మహేష్ మంజ్రేకర్, టాలీవుడ్ సీనియర్ యాక్టర్ జగపతి బాబు, మురళీ శర్మ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ తారాగణంతో ఈ సినిమాను అభిషేక్ పిక్చర్స్, ఎన్ఐకే స్టూడియోస్ పతాకాలపై కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. సౌందర్ రాజన్ సినిమాటోగ్రఫీ, జునైద్ కుమార్-అభి సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. భారీ అంచనాల నడుమ 'నాగబంధం' జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి అడుగుపెట్టనుంది. నాగబంధం చిత్రం టికెట్ల అమ్మకాల పరంగా దూసుకుపోతోంది. ఇప్పటికే వివిధ పోర్టల్స్ లో అడ్వాన్స్ బుకింగ్స్ కు విశేష స్పందన లభిస్తోంది.




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .